మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# వర్షబీభత్సం..



- స్తంభించిన జనజీవనం
- రెండురోజులుగా ఎడతెరిపిలేని వాన
- జలదిగ్బంధంలో పల్లెలు, కాలనీలు
- పలుచోట్ల కూలిన మట్టిమిద్దెలు
- తెగిన రోడ్లు..అలుపారిన చెరువులు,కుంటలు
- లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు యెన్నం,అనిరుధ్‌రెడ్డి
- మహబూబ్‌నగర్,జడ్చర్లలో పర్యటించిన కలెక్టర్ విజయేంద్ర బోయి,ఎస్పీ జానకి
- నేడు విద్యాలయాలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం
- పీయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరును వర్షం ముంచెత్తింది. ఎక్కడ చూసినా కాలనీల్లోకి వరద..అలుగుపారుతున్న చెరువులు, పొంగిపొర్లుతున్న వాగులు..నీట మునిగిన పంటలు..తెగిన రోడ్లు..రాకపోకలకు అంతరాయం..కూలుతున్న మట్టిమిద్దెలు..దర్శనమిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఎక్కడికక్కడక రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెరువులు, కుంటలు నిండడంతో ప్రమాదం జరకుండా ముందస్తుగా అలుగులను తెంపేశారు. భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అధికారులు క్షేత్రం స్థాయిలో పర్యటిస్తున్నారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా పోలీస్, రెవెన్యు యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్లు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేసింది. అల్పపీడనం వల్ల మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది.

- మహబూబ్‌నగర్ -తాండూరు రహదారిలో ఇబ్రహీంబాద్ వద్ద భారీ వర్షాలకు రోడ్డు తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయి అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక రెవెన్యు పోలీస్ యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్‌లోని పలు కాలనీల్లో పర్యటించారు. లోతట్టు ప్రాతాలను మినీ ట్యాంక్ బండ్‌ను పరిశీలించారు. ఎవరు అధైర్యపడొద్దని తాను అండగా ఉంటానని చెప్పారు.

## జడ్చర్ల జలమయం

**– అలుగుతెగిన ఊరకుంట, నల్లచెరువు**

**– చేపలో వేటలో కాలనీవాసులు**

జడ్చర్ల జలదిగ్బంధంలో ఉండిపోయింది. శనివారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం కురియడంతో కాలనీలన్నీ జలమయం అయ్యాయి. ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సిగ్నల్‌గడ్డ నుంచి నేతాజీ చౌక్ వెళ్లే రోడ్డుపై సుమారు నాలుగుఫీట్ల వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వాహనాలు నెమ్మదిగా వెళ్లినా టూవీలర్, చిన్న ఆటోలు వెళ్లడానికి రాలేదు. జడ్చర్లలోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పర్యటించారు. కమిషనర్ రాజయ్యతో కలిసి లోతట్టు ప్రాంతాల కాలనీవాసులతో మాట్లాడారు. పరిస్థితులను గమనించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జడ్చర్ల పద్మావతీ కాలనీలోని ఊరకుంట, కావేరమ్మపేటలోని నల్లచెరువు అలుగు పారడంతో వర్షపు నీరంతా కాలనీల్లోకి చేరింది.

## జడ్చర్లలో చేపలపండుగ..!

ఊరకుంట,నల్లచెరువు అలుగు పారడంతో అలుగులోనుంచి పెద్ద ఎత్తున చేపలు బయకుట రావడంతో ప్రజలు వలలు చేతపట్టుకొని చేపల వేటలో పడ్డారు.పద్మావతీ కాలనీ మొత్తం వలలతో వివిధ రకాల చేపల నెట్‌లతో చేపలు పట్టి ఒక పెద్ద పండుగ చేసుకున్నారని చెప్పవచ్చు. పద్మావతీ కాలనీలో కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, బీజేపీ జిల్లా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి,నాయకులు ఇంతియాజ్‌ఖాన్,పిట్టలమురళి,కోడ్గల్ యాద య్య తదితరులు కాలనీలో వరదనీటిని పరిశీలించారు. ప్రభుత్వం వరదనీరు ఇండ్లలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

- నల్లకుంట వద్ద వరదనీటిని మినీ ట్యాంక్ బండ్‌లోకి మళ్లించేలా సీఐ ఆదిరెడ్డి చర్యలు చేపట్టారు. ట్యాంక్ బండ్ రోడ్డుకు రంధ్రం చేసి నీటిని మళ్లిండచంతో కుంట నిండింది.
- రసాయికుంట, నసురుల్లాబాద్, తంగెళ్లపల్లి,అల్వాన్‌పల్లి గ్రామాల్లో పంట నీట మునిగింది. గోప్లాపూర్, లింగం పేట,కోడ్గల్, కొండేడ్, చిన్నఆదిరాల, పెద్ద ఆదిరాల,గొల్లపల్లి,ఈర్లపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 80ఎకరాల్లో వరిచేను నీటమునిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈమేరకు నాయకులు కోడ్గల్ యాదయ్య,పీఏసీఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్‌గౌడ్,ఇంతియాజ్‌ఖాన్,మాజీ సర్పంచ్ వెంకటేశ్, కృష్ణయ్య పంటలను పరిశీలించారు. ఏఈ నరేష్ రుసాయికుంటను పరిశీలించి పంటనష్టపరిహారం విషయం తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.
- మహబూబ్‌నగ్ ఎస్పీ జానీకీ స్థానిక సీఐ ఆదిరెడ్డితో కలిసి జడ్చర్ల మండలంలోని చర్లపల్లి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు చేయొద్దని సూచించారు. తంగెళ్లపల్లి వద్ద, వాగులను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పరిశీలించారు.
- జడ్చర్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలోని వర్షపునీరు భారీగా చేరింది. అదేవిధంగా పెద్దగుట్ట రంగనాయకస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన దారిలో కొండచరియలు విరిగిడ్డాయి. భక్తులు గమనించి జాగ్రత్తగా ఉండాలని నిర్వాహకులు సూచించారు.
- 17వ వార్డు శాంతినగర్ కాలనీలోకి నీళ్లు చేరడంతో రాత్రంతా జాగరణ చేశారు. వరద నీటిలో ఉండిపోయారు.



ఊరకుంట అలుగు పారడంతో పద్మావతీ కాలనీ చేపలు పట్టుకుంటున్న కాలనీ వాసులు



ప్రధాన రహదారిలో విరిగిన కొండ చరియలు



కాలనీలో పర్యటిస్తున్న ఆనంద్‌గౌడ్



తంగెళ్లపల్లివాగులో ఈత కొడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## వెంటనే చర్యలు తీసుకోవాలి

**ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**కలెక్టర్ విజయేంద్ర బోయితో కలిసి పెద్ద చెరువు పరిశీలన**



చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**మహబూబ్‌నగగర్ బ్యూరో, సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువును జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఇరిగేషన్ డిఇ మనోహర్‌తో కలిసి పరిశీలించారు. బోయినపల్లిలో ఉన్న హనుమాన్ చెరువు అలుగుపారి అధికంగా వర్షపునీరు పెద్ద చెరువుకు చేరుతుందని అందుకే కొంత నీరు లోతట్టు ప్రాంతాలకు వదిలినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇక్కడ వదిలిన నీరు రామయ్యబౌలి, బికె రెడ్డి కాలనీలోకి వచ్చే అవకాశం ఉందని అందుకే ఆటోలో మైక్‌ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ శివేంద్రప్రతాప్,ఇరిగేషన్ డిఇ మనోహర్, తహసిల్దార్ ఘన్సీరాం,నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, బెజ్జుగం రాఘవేందర్ పాల్గొన్నారు.

## వచ్చే వర్షాకాలం నాటికి సమస్య పరిష్కరిస్తా..

**గత బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఈ దుస్థితి**

**చెరువులను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు**



జడ్చర్ల కమిషనర్ రాజయ్యతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** వచ్చే వర్షాకాలం నాటికి జడ్చర్ల పట్టణంలో వరద ప్రభావం లేకుండా చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జడ్చర్ల నియోకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతంలో ఆయన పర్యటించారు. చెరువులు, కుంటలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి కాలనీవాసులతో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్యతో కలిసి పలు వార్డుల్లో పర్యటించి వరద నీరు కాలనీల్లోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ జానకీతో కలిసి చర్లపల్లి రోడ్డుపై వరదను పర్యవేక్షించారు. తంగెళ్లపల్లి గ్రామ రహదారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుని పరిశీ లించి చెరువులో ఈతకొట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత పాలకులు జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వల్లే వరద జడ్చర్లను ముంచెత్తే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. గత పాలకులు చెరువులను కబ్జా చేసి ఇండ్లు కట్టారని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం పని చేశారని చెప్పారు. నేడు వంద పడకల దవాఖాన నీట మునగడానికి అదేకారణమన్నారు. ప్రజల కోసం కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం ఒక నాలాపై దవాఖాన నిర్మించారని చెప్పారు.

## అధైర్యపడకండి అండగా ఉంటాం: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** అండగా ఉంటామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత రాత్రి మహబూబ్‌నగర్ పట్టణంలో కురిసిన భారీ వర్షాలకు జగ్జీవన్‌రాం నగర్‌లో చాలా ఇళ్లకు నీరు రావడంతో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌కు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేయడంతో భారీ వర్షాలకు నిరాశ్రయులైన వారిని కమిటీ హాల్లో పునరావాసం కల్పించారు. నిరాశ్రయులైన వారికి పునరావాస కేంద్రంలో ఎమ్మెల్యే భోజనం అందించి భరోసా ఇచ్చారు. మీకు ఏ సమస్య వచ్చినా కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ఆర్డీఓ నవీన్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, బెజ్జుగం రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

**కూలిపోయిన ఇంటికి నష్టపరిహారాన్ని అందజేత...**

మహబూబ్‌నగర్ పట్టణంలోని టిడి గుట్టలో కొన్ని రోజుల క్రితం ఎన్. లక్ష్మమ్మకు చెందిన ఇల్లు కూలిపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన నష్టపరిహారాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో రూ. 95,100 నగదును బాధితులకు అందజేశారు. వర్షాలు తగ్గిన తర్వాత ఇల్లు మరమ్మతులు చేసుకోవాలని ఆయన లక్ష్మమ్మకు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఘన్సీరాం, నయాబ్ తహసిల్దార్ దేవేందర్, లక్ష్మమ్మ, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

## టీ హాబ్ ఉద్యోగుల విధి నిర్వహణపై నిర్లక్ష్యం..

**లక్షల విలువైన యంత్రాలు వర్షం పాలు...!**

**పర్యవేక్షణ లోపమని వైద్య అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం...!**

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్యం కోసం లక్షలు వెచ్చించి టీ హబ్‌లో యంత్రాలు సమకూరుస్తే టీ హబ్ నిర్వాహకులు గాలికి వదిలేసిన పరిస్థితి వనపర్తిలో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ హబ్ లో చోటు చేసుకుంది. భారీ వర్షాలు కురవడంతో జలమయమైన రోడ్లను చెరువులను కుంటలను స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరిశీలించారు. అందులో భాగంగా వనపర్తి మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వర్షం నీరు చేరి జలమయమైన పరిస్థితిని ప్రత్యక్షంగా చూశారు. గత పాలకులు బఫర్ జోను , నాలాలకు సంబంధించిన డి-8 కాల్వ అటాచ్ లో ఉన్నదని తెలిసిన కూడా నిర్మాణం చేపట్టి ఆసుపత్రిని నీటిలో మునిగే పరిస్థితి బాటలు వేసిన నాయకులు ఏ మేరకు అభివృద్ధి చేశారా అన్నది అర్థమవుతుందన్నారు. తెలంగాన టీహబును పరిశీలించి టీ హబ్‌లో ఉన్న పరిసరాలను విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను పది అంశాలపై పనిచేసే సిబ్బందిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విధి నిర్వహణ డయాగ్నోస్టిక్ సెంటర్ నిత్యవసరమైన రూల్స్ బ్రేక్ చేసే విధానం గా నడుస్తుందని సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫోను ద్వారా సమాచారం అందజేశారు. ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పేద ప్రజల కోసం నిర్మించిన టి హబ్ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పని అయినా క్వాలిటి కంట్రోల్ తోనే నడవాలని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడితే కాంట్రాక్టర్లకు ఇబ్బందులు ఎదురవుతాయని సూచించారు. కొత్తగా నిర్మించే క్రిటికల్ కేర్ హాస్పిటల్ ప్రస్తుతం నిర్మాణంలోనే పూర్తిగా వర్ష నీటిలో మునిగిందని పర్యవేక్షణ లేకుండా ఎలా నిర్మాణాలు చేపడతారని అడిగారు. ఇప్పటివరకు జరిగిన బిల్లులు ఆపేయాలని, ఇకమీద జరిగే పనులు క్వాలిటీ ఆఫీసర్ నిర్ధారించిన తర్వాతనే ఎంబి రికార్డు అవ్వాలని సంబంధితాధికారికి ఆదేశించారు. అనంతరం జరిగిన సంఘటనపై కలెక్టర్ కు వివరించి వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు.



టీ హాబ్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి

టీ హాబ్ నిర్వహణ, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే టీ హాబ్ లో మొత్తం 14 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఏ ఒక్కరు కూడా లేకపోవడం పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలామంది నిరుపేదలు ఆరోగ్య సమస్యలను కోసం పరీక్షలు చేయించుకునే అతి ముఖ్యమైన హబ్ లోనే విధి నిర్వహణలోపం ఉందని వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్యెల్యే కలెక్టర్ సూచించారు.

**క్వాలిటీ లేకుండా నిర్మాణాల చేపట్టొద్దు...!!**

మాతా శిశు సంరక్షణ కేంద్రం వెనకాల భాగంలో నిర్మించే క్రిటికల్ కేర్ హాస్పిటల్ నిర్మాణం క్వాలిటీ గా సంబంధిత ఈఈ తో సంబంధిత కాంట్రాక్టర్ కి సూచించారు. ఆదేశించారు. పూర్తిగా నిర్మాణానికి సంబంధించిన పూర్తి డాటా పరిశీలించిన తర్వాతే పనులు మొదలు పెట్టాలని హెచ్చరించారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పని అయినా క్వాలిటీ కంట్రోల్ తోనే నడవాలని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడితే కాంట్రాక్టర్లకు ఇబ్బందులు ఎదురయ్యేతాయని సూచించారు. కొత్తగా నిర్మించే క్రిటికల్ కేర్ హాస్పిటల్ ప్రస్తుతం నిర్మాణంలోనే పూర్తిగా వర్ష నీటిలో మునిగిందని పర్యవేక్షణ లేకుండా ఎలా నిర్మాణాలు చేపడతారని అడిగారు. ఇప్పటివరకు జరిగిన బిల్లులు ఆపేయాలని, ఇక మీద జరిగే పనులు క్వాలిటీ అఫీసర్ నిర్ధారించిన తర్వాతనే ఎంబి రికార్డు అవ్వాలని సంబంధితాధికారికి ఆదేశించారు. అనంతరం జరిగిన సంఘనపై కలెక్టర్ సూచించారు.

## అప్రమత్తంగా ఉండాలి

- రానున్న రెండు రోజులు అతి భారీ వర్షాలు
- విసిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రెవెన్యూ పోలీస్ యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





విసికి హాజరైన మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రబోయి, అధికారులు, విసిలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

**మహబూబ్‌నగర్ బ్యూరో,గద్వాల, సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** రానున్న రెండు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపినందున అన్ని జిల్లాల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాలపై ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, డిజిపిలు హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌కు డిప్యూటీ సిఎం ఖమ్మం నుండి హాజరయ్యారు. శనివారం, ఆదివారం కురిసిన భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా జిల్లా యంత్రాంగాలు తీసుకున్న చర్యల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా రానున్న రెండు రోజులు పని చేయాలని కోరారు. రెవెన్యూ, పోలీసులతో పాటు ఇతర శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విద్యుత్‌శాఖ క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ఒకవేళ ఎక్కడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లయితే తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని, సోమవారం సైతం పలు జిల్లాల లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నచోట గోడలు పడిపోయేందుకు అవకాశం ఉందని, అలాంటి వాటిని గుర్తించి ముందే ప్రజలను ఖాళీ చేయించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సురక్షిత ప్రాంతాలలో ఉంచాలని చెప్పారు. సాగునీటి చెరువుల నుండి అలుగు పారే నీటివల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, విద్యుత్, ఇతర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, జిల్లా కలెక్టర్లు, వారి స్థాయిలో పనిచేసే విపత్తు బృందాలను అప్రమత్తం చేసి సిద్ధంగా ఉంచుకోవాలని, ఎలాంటి పరిస్థితి అయినా ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాల్సిందిగా ఆదేశించారు. రానున్న రెండు రోజులు అధికారులు, సిబ్బంది ఎవరికి సెలవులను మంజూరు చేయవద్దని అన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి రదారులపై వరదనీరు పొంగిపొరలే చోట ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్‌ను అనుమతించవద్దని ట్రాఫిక్‌ను మళ్లించాలని అలాగే ట్రాఫిక్ నీటిలో దిగకుండా గట్టి చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికాకుండా చూడాలని, నష్టం తక్కువగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. నది పరివాహక ప్రాంతాలలోకి ఎవరు వెళ్లవద్దని, అలాగే పశువులను తీసుకు వెళ్లకూడదని, ముఖ్యంగా చేపలు పట్టేందుకు మత్స్యకారులు నీటిలోకి వెళ్లవద్దని, పడియేందుకు సిద్దంగా ఉన్న ఇండ్ల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అలాగే పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్య అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భారీ వర్షాలలో ప్రజలకు అండగా ఉండాలని చెప్పారు. ఈ విడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీ జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, రెవెన్యూ పోలీస్ పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్, విద్యుత్, వైద్యారోగ్య తదితర శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

## రానున్న రెండు రోజులు జాగ్రతగా ఉండాలి

**గద్వాల, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** వర్షం కారణంగా వాగులో నీటి ప్రవాహం తీవ్రమైందని, ఈ పరిస్థితుల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ సూచించారు. గురువారం ఉండవెల్లి మండలంలోని మెన్నిపాడు వాగు వరద ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాగును ఎవరూ దాటకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాగు నీటి ప్రభావం, నీటి ఎత్తు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాల రాకపోకలను నిశేదించి, ప్రజలకు సరైన ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలని సూచించారు. వాగులకు దగ్గర లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని, పరిష్కారిస్తామన్నారు. వర్ష ప్రభావం గ్గేవరకు , వాగు దాటవద్దని ప్రజలను ఆదేశించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మనోపాడ్ మండలంలోని నారాయణపురం గ్రామంలో రైల్వే అండర్ పాస్ వద్ద నిలిచిన నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ పాస్ దాటడం ప్రమాదకరంగా ఉంటుందని పేర్కొంటూ, అక్కడి నీటిమట్టాన్ని తగ్గించేందుకు

- మిగతా3లో..



వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

## ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి...

**- సోమవారం విద్యా సంస్థలకు సెలవు...**

**- నేడు ప్రజావాణి రద్దు... - జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** జిల్లాలో రాబోవు 48 గంటల పాటు అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో మరో 48 గంటలు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వీటి వల్ల పెద్ద ఎత్తున వరదలు వచ్చే ప్రమాదం ఉందని, దీనిని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం అన్ని విద్యా సంస్థలకు కలెక్టర్ సెలవును ప్రకటించారు. సోమవారం నిర్వహించే ప్రజావాణిని సైతం రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అతి భారీ



- మిగతా3లో..

# కస్తూర్బా స్కూల్‌ను పరిశీలించిన ఎంపీ ఎమ్మెల్యే



కస్తూర్బా స్కూల్లో పరిశీలించి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎమ్మెల్యే

**పెబ్బేరు సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని కస్తూరిబా స్కూల్లో ఆదివారం రోజు ఎంపీ ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్లోని పరిసరాలను వంటగది బాత్రూమ్స్ బెంచీలు వాటర్‌ను పరిశీలన చేశారు. కేజీబీవీ స్కూల్ గాని గురుకుల స్కూల్ గాని కాంగ్రెస్ ప్రభుత్వంలో మునుముందు డెవలప్‌మెంట్ చేయడం జరుగుతుందని టిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒరగబెట్టింది ఏం లేదని విద్యా వ్యవస్థను వెనక్కి తీసుకెళ్లారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక స్కూల్లో కాని గురుకుల పాఠశాలలు గాని విద్యావ్యవస్థ సరి చేయడం జరిగిందని నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ త్వరలో ప్రారంభిస్తామని నర్సరీ నుండి మూడో తరగతి వరకు 11200 అంగన్‌వాడీలలో పిల్లలను చదివిస్తామని నాలుగో తరగతి నుండి డిగ్రీ వరకు ఇంటిగ్రేటెడ్ స్కూల్లో చదివించి మా పిల్లలకు మంచి భవిష్యత్తు చూపిస్తామని ఎమ్మెల్యే మెగారెడ్డి తెలియజేశారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక స్కూల్లు కాలేజీలు గురుకులాలు పోటీపడి సీట్ల కోసం పిల్లల కష్టపడుతున్నారని గురుకులాల్లో చదవడానికి విద్యార్థులు మొగ్గు చూపుతున్నారని తెలంగాణ ప్రభుత్వంలో గురుకుల స్కూల్ అంటేనే భయపడే వాళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక గురుకుల సీట్ల కోసం పోటీపడి పరీక్షలు రాస్తున్నారని ఎంపీ మల్లు రవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, నర్సు మౌనిక, జిల్లా బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మాజీసర్పంచులు సురేందర్‌గౌడ్, వెంకటేశ్, సాగర్, రవీందర్ నాయుడు, గంధం రంజిత్, నరసింహనాయుడు, రాముడు, సర్వేశ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు

**ప్రజలకు సూచించిన తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంఛార్జి ఎంపిడిఓ**

**వాగులు, పాడుబడ్డ ఇళ్లను పరిశీలించిన అధికారులు**



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

**బాలానగర్, సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని బాలానగర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ విజయకుమారి ప్రజలకు సూచించారు. ఆదివారం బాలానగర్ మండల పరిధిలోనిపలు గ్రామాలలో, తండాలలో తహసిల్దార్ పర్యటించి పరిస్థితి సమీక్షించారు. తిరుమలగిరి నుంచి కిచ్యా నాయక్ తండా, దేగావత్ తండాలకు వెళ్లే రోడ్డుపై ఉన్న బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న వరదను పరిశీలించారు. వాతావరణ శాఖ ఇస్తున్న సూచనల మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచిస్తున్నారు. అంతే కాకుండా విద్యుత్ స్థంభాలకు దూరంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలకు వరద నీరు ప్రవహించే ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకూడదని సూచించారు.

# పాత పెన్షన్ అమలు చేయాలి

**ఉట్కూర్, సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో విలేఖరుల సమావేశంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ ఉద్యోగులకు ఇచ్చిన పాత పెన్షన్ అమలు హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శులు నరసింహ డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1 కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ అమలుకు వ్యతిరేక దినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కేంద్ర ఉద్యోగులకు సంబంధించినదని రాష్ట్ర ఉద్యోగులకు సంబంధించిన పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. కొన్ని సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయకుండా వ్యవహరించడం చూస్తుంటే పుండు ఒకచోట అయితే మందు మరోచోట రాసినట్టు ఉందని ఎద్దేవా చేశారు.

# కంటి ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

**ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేసిన లయన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి**



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న లయన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని తిమ్మరాశిపల్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. గత నెల 30న నిర్వహించిన మెగా హెల్త్ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి గుర్తించిన 27 మందికి జోన్ చైర్మన్ సంపత్ జనార్ధన్‌రెడ్డితో కలిసి రాంరెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి కంటి అద్దాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ కళ్ళను శుచి శుభ్రతతో భద్రపర్చుకోవాలని, లయన్స్‌క్లబ్ ద్వారా చేపట్టిన ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. కళ్ళు బాగుంటేనే ప్రపంచంలో ఏదైనా చూడగలుగుతామని, తమకు అందజేసిన అద్దాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని డాక్టర్ వి.దామోదర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ సంపత్ జనార్ధన్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, క్లబ్ సభ్యులు పి.వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, క్లబ్ పీఆర్‌ఓ పాష, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా ఆంజనేయస్వామి బిందెసేవ

**-వైభవంగా గంగాదేవికి పూజలు**

**దేవరకద్ర, సెప్టెంబరు 01 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో శ్రీ ఆంజనేయస్వామి బిందెసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గోపన్‌పల్లిలో ప్రతి ఏడాది శ్రావణమాసం చివరి రోజు సందర్భంగా స్వామి వారి బిందెసేవను ఘనంగా నిర్వహించారి. గ్రామ సమీపంలోని వ్యవసాయబావి నుండి నీటిని తీసుకవచ్చి పూజారి మఠం సురేశ్‌స్వామి, తమ్మలి రవికుమార్, తమ్మలి వెంకటయ్యల అధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే అర్చనలు నిర్వహించారు. అలాగే గ్రామదేవతలకు కూడ పలు పూజలు నిర్వహించారు. విశేష దినోత్సవం సందర్భంగా ఆంజ నేయస్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. షందూర, తమలపాకుల పూజలు కూడ నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజ నేయస్వామి మూల విగ్రహాన్ని రకరకాల పూలు, వివిధ ఆభరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ పూజా కార్యక్రమంలో పుట్టపల్లితో పాటు దేవరకద్ర, కౌకుంట్ల, డోకూ ర్, కోటకదిర గ్రమాలకు చెందిన భజనపరులు పాల్గొని అఖండభజన చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి మఠం సురేశ్‌స్వామి, తమ్మలి రవికుమార్, తమ్మలి వెంకటయ్యలతో పాటు గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# చెక్కులు పంపిణి చేసిన ప్రజా ప్రతినిధులు

**పెబ్బేరు మండల పరిధిలో 106 మంది లబ్ధిదారులకు మంజూరైనా సిఎం రిలీఫ్ ఫండ్**

**గ్రామాల్లో నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందచేయాలని శ్రేణులను ఆదేశించిన ఎమ్మెల్యే**

**పెబ్బేర్ సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పెబ్బేరు మండల పర్యటనలో భాగంగా విచ్చేసిన డాక్టర్ మల్లు రవి పార్లమెంట్ సభ్యులు, తూడి మేఘారెడ్డి శాసనసభ్యులు వనపర్తి మండల పరిధిలో గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టి రాంచంద్ర రెడ్డి, హన్మంత్, అనూష, లబ్ధిదారులు మండల కేంద్రంలో అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైనా ప్రభుత్వం ప్రజా పాలన దిశగా అడుగులు వేస్తూ సాగుతుందని, అన్ని రంగాల ప్రజలకు అనుగుణంగా తమ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

# వెంటనే స్పందించిన వనపర్తి ఎమ్మెల్యే



పనులను పర్యవేక్షిస్తున్న గ్రామస్తులు

**పెబ్బేర్ సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మండలం అయ్యవారిపల్లి గ్రామంలో గత పది సంవత్సరాల నుండి చెరువు అలుగు దగ్గర ముళ్ళకంప పేరుకుపోయి ఉండటం వలన ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలకు అలుగు గుంజకపోవడం వలన ఊరిలోకి చెరువు తెగే ప్రమాదం పొంచి ఉన్నది కావున మన ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు జెసిబి పెట్టి ముళ్ళ కంపను తొలగించడం జరుగుతున్నది. కాంగ్రెస్‌కార్యకర్తలు, రైతులు, గ్రామస్తుల సహకారంతో, ముత్త లక్ష్మన్ నాయుడు, బాలరాజు, భాస్కర్, యాదవస్వామి, కురుమూర్తి, ఖదీర్, అంజి, మహేందర్, నవీన్, మూర్తి, వినోద్, చందు, బీచుపల్లి, గోపాల్, గోవిందు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఉద్యోగులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానమే అమలుపర్చాలి...

**- నూతన పెన్షన్ వద్దు పాత పెన్షన్ అమలు చేయాలి... - పాత పెన్షన్ అమలుపై ఉద్యోగ సంఘాల నిరసన**




నాగర్‌కర్నూల్‌లో నిరసన చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు



కల్వకుర్తిలో నిరసన చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ పక్షాన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఆదివారం సీపీఎస్ విధానాన్ని రద్దు పర్చాలని, పాత పెన్షన్ విధానాన్ని ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.పర్వత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రూపాల్లో పెన్షన్ విధానాన్ని తీసుకొని రావడం సరైంది కాదని, ప్రతి ఉద్యోగి, ప్రతి ఉపాధ్యాయునికి పాత పెన్షన్ స్కీం సరైనదని, తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, మురళి, కొత్త శ్రీధర్‌రావు, ఆర్.కృష్ణ, శ్రీధర్‌శర్మ, రామస్వామి, లక్ష్మణ్, షర్ఫుద్దిన్, సంజీవ్, శ్రీనివాసులు, సురేష్ కళ్యాణ్, రాజు, ఈశ్వర్, మధుసూదన్‌రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

**కల్వకుర్తిలో....** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానం అమలులోకి వచ్చిన పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా కల్వకుర్తి డివిజన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి డివిజన్ అధ్యక్షులు రాజేందర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ సీపీఎస్ విధానంను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

# వరదల పరవళ్లు..!!

- **చెక్‌డ్యాంల మురిపాలు..**
- **చెర్వులు, కుంటల అలుగుల పారుదలలు..**
- **వర్షం రాకతో ఒక్కసారిగా జలకళలు..**
- **అలుగు పారుతున్న భూత్పూర్ ఊరగుంట చెర్వు**
- **ఊరకుంట అలుగు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్**



ఊరగుంట అలుగు వద్ద పూలు జల్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్



మద్దిగట్ల పెద్ద చెర్వు వద్ద తూములు తెరిపిస్తున్న ఎమ్మార్వో, మాజీ ఎంపిపి కదిరే, సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి తదితరులు

**భూత్పూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఎక్కడ చూసినా చెర్వులు, చెక్‌డ్యాంలు, కుంటలేకమై అలుగులు పారుతున్నాయి. వర్షాల కారణంగా గ్రామాలు, పట్టణాలు జలకళను సంత రించుకున్నాయి. నీరు లేక ఎండిన చెర్వులు, కుంటలు, చెక్‌డ్యాంలు వర్షం కారణంగా వరదనీటితో మమేకమై వరదల రూపంలో పరవళ్లు తొక్కతున్నాయి. చెర్వులు, చెక్‌డ్యాంలు నిండి అలుగుల ద్వారా వదరనీరు ప్రవహిస్తోంది. ఎటు చూసినా వర్షపు నీటితో నిండిన చెర్వులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండు కుండల్ని తలపిస్తున్నాయి. వరదనీరు రోడ్లెక్కి పారుతుండడంతో కొన్న ప్రాంతాలలో రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. మద్దిగట్లకు సమీపంలోని పెద్ద చెరువు నిండి అలుగు పారుతోంది. చెరువు నిండి ప్రమాదభరితంగా మారడంతో అధికారులు ప్రజాప్రతినిధులు చెరువు వద్దకు చేరుకుని చెర్వు తూములు తెరిపించి నీటిని దిగువకు వదిలే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ తహశీల్దార్ రాజు, సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి, మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ఇక భూత్పూర్ పట్టణ కేంద్రంలోని ఊరగుంట చెర్వు నిండి అలుగు పారుతోంది. విషయం తెల్సుకున్న స్థానిక మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఇతర నాయకులు అలుగు వద్ద పూలు జల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం యాదయ్య, సత్తూర్ అశోక్‌గౌడ్, వడ్ల బ్రహ్మయ్య, పులగుర్ల మల్లేష్, మొహ్మద్ జహంగీర్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్‌తో పాటు భూత్పూర్ శ్రీహనుమాన్ భజన బృందం సభ్యులు చీపుర్ల సాయిలు, సత్తూర్ కృష్ణయ్యగౌడ్, శ్యాంసుందర్ చారి, గోనెల నాగరాజు, తిర్లపురం విజయ్, గొడుగు శివశంకర్ ఇతర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. భూత్పూర్‌కు సమీపంలోని వాగు నిండి వరదనీరు ప్రవహిస్తోంది. కత్వ నిండి అలుగు పారుతోంది. కత్వ వద్ద కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు జైదు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమిస్తాపూర్ పట్టణానికి సమీపంలోని నాందారి చెర్వు నిండి అలుగు పారుతోంది. హస్నాపూర్- శేరుపల్లిల మధ్య ఉన్న చెర్వు నిండి అలుగు పారుతుండడంతో పాదచారులు, వాహనచోధకుల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది పోతులమడుగు, ముత్యాలంపల్లి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రావులపల్లి చెక్‌డ్యాంలు నిండి నిండుకుండల్నితలపిస్తున్నాయి. అలుగులు పారి ఆనందాన్ని కల్గిస్తున్నాయి. కొన్ని మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాలు, తండాలకు రాకపోకల కనెక్షన్‌కట్ అయిందనే చెప్పాలి. కొన్ని గ్రామాల్లో పాడుపడ్డ మిద్దె ఇళ్లు కూలాయి. ఎడతెరిపిలేని వర్షం కారణంగా భూత్పూర్ మండలంలోని తాటిపర్తి, భట్టుపల్లి గ్రామాలలో ఇళ్ల పాక్షికంగా దెబ్బ తిన్నాయి. ఎడతెరిపిలేని వర్షానికి అమిస్తాపూర్ పట్టణం ఆరోవార్డుకు చెందిన లక్ష్మమ్మ ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. కొన్ని ప్రాంతా లలో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్ల కుటుంబీకుల్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకుతరలించారు. రెండు రోజుల ఎడతెరిపిలేని వర్షం వల్ల భూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాలల్లోని చెర్వులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండి జలకళను సంతరించుకున్నాయి.

# పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

**చెరువులను తలపిస్తున్న పంట పొలాలు**

**పలు గ్రామాల రాకపోకలకు అంతరాయం**



వరద నీటితో నిండిపోయిన పంట పొలాలు

**బాలానగర్, సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బాలానగర్ మండలంలో శనివారం, ఆదివారం రెండు రోజులపాటు కురుస్తున్న వర్షాల కారణంగాపలు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అలాగే పంట పొలాలలో వదరనీరు చేరి, చెరువులను తలపిస్తున్నాయి. పలు గ్రామాలకు, తండాలకు వెళ్లే రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాలానగర్ మండలంలోని కుంటలు, చెరువులు, కాలువలు జలకళ సంతరించుకున్నాయి. ఈ వర్షాలకు భూగర్భ జలాలు సమృద్ధిగా నిండుతాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టండి



బ్రిడ్జిపై నుండి వరదనీరు ప్రవహిస్తున్న దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మండలంలోని సంగంబండ, మాగనూరు మండలంలోని నేరడుగాం గ్రామాల మధ్య సంగం బండ ప్రాజెక్టు దిగువన ఉన్న నేరడుగం రోడ్డు బ్రిడ్జి మరమ్మతు పనులను తక్షణమే చేపట్టి, ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను తొలగించాలని మాజీ ఎంపిటిసి జి. బలరాంరెడ్డి డిమాండ్ చేశారు. నేరడుగం బ్రిడ్జిపై నుండి రాకపోకలు నిలిచిపోయిన నేపథ్యంలో ఆదివారం ఆయన సంగంబండ వద్ద బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. సంగంబండ ప్రాజెక్టుకు కేవలం 50 మీటర్ల దూరంలో గల ఈ రోడ్డు బ్రిడ్జి దిగువన గల పైపులు పూర్తిగా మట్టితో మూసుకుపోయినందు వలన రహదారిపైకి నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని ఆయన అన్నారు. బ్రిడ్జికి గల మొత్తం 16 పైపులకు గాను నాలుగు చోట్ల పైపులు పూర్తిగా మూసుకుపోవడం జరిగిందన్నారు. మిగతా చోట్ల సైతం పైపులు మట్టి కూరుకుపోయి నీరు దిగువకు వెళ్లేందుకు ఇబ్బంది ఎదురవుతున్నదని అన్నారు. దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో వరద నీరంతా బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండడంతో ప్రజలు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి బ్రిడ్జికి మరమ్మతు చేపట్టాలని, పైపులలో కూరుకుపోయిన మట్టి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఖిల్లాలో జోరుగా కురుస్తున్న వర్షం

**పొంగి పొర్లుతున్న వాగులు చెక్ డ్యాములు**



ఉదృతంగా ప్రవహిస్తున్న పల్లి వాగు

**ఖిల్లా ఘణపురం సెప్టెంబర్ 1 ప్రభాతవార్త** మండలంలోని గత శనివారం కురుస్తున్న వర్షంతో మండలంలోని వాగులన్నీ పొంగిపొర్లుతున్నాయి మండలంలోని మామిడవాడ కమాలుద్దీన్పూర్ వెళ్లే గ్రామాలకు వెళ్లే దారులను అధికారులు కంపచెట్లు వేయించి మూసివేశారు. మల్కిమియన్ పల్లి గ్రామ శివారు గుండా వెళుతున్న పిల్లి వాగు ఉదృతంగా ప్రవహిస్తుండటంతో వాగు వెంబడి ఉన్న రైతుల పొలాలు కొట్టుకుపోయాయి. కప్పెట చెన్నయ్యకు చెందిన దాదాపు 30 గుంట వరి పొలం వరద తాకిడికి గురై కొట్టుకుపోయింది. పలువురి స్టార్టర్లు మోటర్లు వాగులు కొట్టుకుపోయాయి వాగు పక్కనే ఉన్న కర్రైనకు చెందిన కోళ్ల ఫారం కు సంబంధించిన సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్‌తో పాటు రైతులకు సంబంధించిన 25 కె.వి ట్రాన్స్ఫర్మర్‌ను గ్రామానికి చెందిన యువకులు రాజశేఖర్ పవన్ గౌడ్ బిక్షపతి ఆంజనేయులు ట్రాక్టర్ పై రెండు ట్రాన్స్ఫర్మర్లను ఒడ్డుకు తరలించారు. మండలంలోని పలు గ్రామాలలో పత్తి చేలు వరద తాకిడికి గురయ్యాయని వరదలు మునిగిపోయాయని రెవెన్యూ వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

**కిష్టారెడ్డిపేట - శేరుపల్లి**

# మధ్యలో ఉన్న వాగు ప్రవాహం



కిష్టారెడ్డిపేట - శేరుపల్లి ఉదృతంగా పోతున్న వాగు

**పెబ్బేరు సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** కిష్టారెడ్డిపేట - శేరుపల్లి మధ్యలో ఉన్న వాగు ఉదృతంగా పోతుంది. పెబ్బేరు కొల్లాపూర్ రాకపోకలు బంద్ శ్రీరంగాపూర్ గేట్లు ఎత్తడం వల్ల మూడు నాలుగు రోజులు రోడ్డు పూర్తిగా బంద్ చేశారు.

# కేఎల్ఐ కాల్వకు గండి...


**నీట మునిగిన పంట పొలాలు...**



తెగిన కాల్వతో బయటకు వస్తున్న నీరు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద గ్రామం వద్ద కేఎల్ఐ కాల్వకు గండి పడటంతో కాల్వ చుట్టు ప్రక్కల రైతులు సాగు చేసిన 20 ఎకరాల్లో పత్తి, వరి, మొక్క జొన్న పంటలు నీట మునిగాయని గ్రామ మాజీ సర్పంచ్ పుట్ట శేఖర్, గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకంగా కాల్వల నిర్మాణం చేపట్టడంతో భారీగా వరద నీరు వస్తే కాల్వకు గండి పడుతుందని ఆయన పేర్కొన్నారు. గండి పడిన కాల్వను వెంటనే పూడ్చి కాల్వలోని చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించాలని తెలిపారు. నీట మునిగిన పంటలకు రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

# ఉదృతంగా ఊక చెట్టు వాగు..



**కొత్తకోట సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మదనాపూర్ రైల్వే గేట్ సమీపంలో ఊకచెట్టువాగు ఉదృతంగా ప్రవహిస్తున్నందున ఆత్మకూరు వనపర్తి రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తకోటమండలం కానాయపల్లి శంకర సముద్రరిజర్వాయర్ గేట్లు తెరవడంతో సరళసాగర్‌కు నీటిశాతం పెరగడంతో ఆటోమెటిక్ సైబన్లు ఓపెన్ అయ్యాయి.

# భారీ వర్షాలకు రాకపోకలు బంద్



రాకపోకలు నిలిచిపోయిన దృశ్యం

**ఉట్కూర్, సెప్టెంబరు01 ప్రభాతవార్త:** నారాయణపేటకు వెళ్లే దారిలో భారీవర్షం కారణంగా రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలను నిలిపివేసిట్లు ఎంపిడిఓ ధనుంజయగౌడ్ తెలిపారు. తహసిల్దార్ రవికుమార్ ప్రజలు అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప బయటికి వెళ్లొద్దని తెలిపారు. అలాగే మల్లేపల్లి ఊరు దగ్గర నీరు నిల్చుకోవడంతో తహసిల్దార్ విద్యార్థులను ట్రాక్టర్‌పై పంపించారు.

**వర్షానికి కూలిన ఇండ్లు**

మండల కేంద్రంలో గత రెండు రోజులు కురుస్తున్న వర్షాలకు మెయిన్‌బజార్ హనుమాన్ మందిర్ దగ్గరలో ఉన్న మేస్త్రీ లక్ష్మణ్ ఇల్లు కూలిపోయింది. ముగ్దుంపూర్ చౌరస్తాలోని మహ్మద్‌రఫీ చాంద్ ఇల్లు కూలిపోవడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి పరిశీలించి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని అలాగే ఇల్లులేని వారికి ప్రభుత్వం గ్రామ పంచాయతీ దగ్గర వసతి కల్పిస్తుందని తెలిపారు. ఆయన వెంట మాజీ వార్డు మెంబర్ నరసింహ రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

# మల్లమ్మకుంట అలుగు కాలువ..

**మూసాపేట, సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని చక్రాపూర్ గ్రామంలో గల మల్లమ్మకుంట అలుగు కాలువ కొందరు రైతులు ధ్వంసం చేసి కాలువను కనుమరుగు చేశారు. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయింది. వర్షాకాలం వచ్చిందంటే భారీ పంట నష్టం జరుగుతుందని కల్వర్టును ధ్వంసం చేసిన రైతులకు చెప్పినా వినడం లేదు. రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మ్మలమ్మకుంట నిండు కుండలా మారి 2 రోజుల నుంచి అలుగు పారుతూ నీరు మొత్తం పంట పొలాలపై పారుతూ వరి పంటలు మొత్తం కొట్టుకుపోయాయని చెరువు కింద ఉన్న రైతులు మొరపెట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా మల్లమ్మకుంట అలుగు కాల్వను ఎప్పటిలాగానే ఏర్పాటు చేయాలని అంటున్నారు.



చక్రాపూర్‌లో తెగిన శేలిమ ముళ్ల చెక్‌డ్యాం

**బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతుల ఆవేదన...**

మండలంలోని పోల్కంపల్లి గ్రామం పోల్కంపల్లి నుండి కప్పెట వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలుమార్లు ఉన్నతాధికారులు పోల్కంపల్లి రైతులు ఎన్నిమార్లు అధికారులను కలిసినా అప్పటి పాలకుల దృష్టికి తీసుకెళ్లినా బ్రిడ్జి నిర్మాణం కాలేదు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల్లో రాకపోకలు బంద్ అవుతాయి. పోల్కంపల్లి గ్రామానికి చెందిన రైతులకు కప్పెట శివారులో దాదాపు 300ల ఎకరాలకు పైగా వ్యవసాయ పొలాలు ఉన్నాయి. వ వాగు వచ్చిందంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ నష్టపోవాల్సి వస్తుంది అంటున్నారు. గత నెల మాజీ జడ్పీటిసి రామన్‌గౌడ్, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత అధికారులను అక్కడికి పంపించడం జరిగిందని త్వరలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించేలా చూడాలని మాజీ జడ్పీటిసి సభ్యుడు రామన్‌గౌడ్ గ్రామస్తులను కోరుతున్నారు. వాగు ఉధృతంగా పారుతుండడంతో రైతులు రోడ్డుకు అడ్డంగా ఎర్రబట్టలు కట్టి ఉంచి దారి లేదని సూచిస్తున్నారు.

## భైరాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతి



**వెల్దండ, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** మండల కేంద్రం నుంచి చారకొండకు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై భైరాపూర్ గ్రామ సమీపంలో భైరాపూర్ వాగు తెగిపోయి 2 సంవత్సరాలు గడుస్తున్న నేటికి శాశ్వత పరిష్కారం కాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని భైరాపూర్ గ్రామస్తులు తలారి నర్సింహ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తలారి నర్సింహ్మ మాట్లాడుతూ వాగుపై తాత్కాలిక ఏర్పాట్లు చేసిన భారీ వర్షాలు కురిస్తే వాగు పారితే కూలిపోయే ప్రమాదం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు వెంటనే మంజూరు చేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పెద్ద అంజయ్య, జంగయ్య, రామస్వామి, మల్లేష్, సాయి, తిరుమల, కృష్ణయ్య, గిరిప్రసాద్, రవి తదితరులు ఉన్నారు.

## జూరాల ప్రాజెక్టుకు సందర్శకులు రావొద్దండి:ఎస్సై

**అమరచింత సెప్టెంబర్1, ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా దిగువ నుండి జూరాల ప్రాజెక్టుకు భారీ వరద ప్రమాదకరంగా నీటి ప్రభావం ఉండడంవల్ల జూరాల ప్రాజెక్ట కు వచ్చే సందర్శకులకు అనుమతులు లేవని అమరచింత ఎస్సై సురేష్ తెలిపారు. ఆదివారం జూరాల ప్రాజెక్ట డ్యాం పై పోలీసులు రక్షణ వలయం ఏర్పాటు చేశారు. మత్స్యకారులు గొర్రె కాపరులు పశువుల కాపరులు జూరాల ప్రాజెక్టులో నీటి ప్రారంభం ఎక్కువ ఉండడం వల్ల ఎవరు కూడా ప్రాజెక్ట దగ్గరకు వెళ్లకూడదని ఆయన వారిని కోరారు. అలాగే అమరచింత నర్వ మరికల్ మక్తల్ సంబంధించిన ప్రయాణికులు గద్వాల్ కు వెళ్లడానికి జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :ఎస్సై

**ఉట్కూర్,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మండల గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై కృష్ణంరాజు తెలిపారు. రానున్న రెండు రోజులు భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురవనున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పురాతనమైన ఇళ్లలో ఉన్న వాళ్లు సురక్షితమైన ప్రదేశాల్లో ఉండడం శ్రేయస్కరమని తెలిపారు. అత్యవసరమైన పరిస్థితుల దృష్ట్యా

## భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి:తహసీల్దార్

**ఇటిక్యాల సెప్టెంబర్1 ప్రభాతవార్త:** భారీ వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారీ వర్షాలకు మట్టి మిద్దెలు తడిసి పడిపోయే ప్రమాదం ఉంటుందని అలాంటి ఇండ్ల యజమానులు కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని పడిపోయే ప్రమాదం ఉంటే ముందుగానే గ్రహించి మరోచోట ఉండేలా చూసుకోవాలని తహశీల్దార్ నరేందర్ మండల ప్రజలను కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం తహశీల్దార్ నరేందర్. ఆర్ ఐ భీమ్ సెన్ రావు సిబ్బంది కార్యాలయంలో ఉండి భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పర్యవేక్షించారు. రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి లో వరద నీరు ప్రవాహం ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతుండగా అక్కడికి వెళ్లి వారు పరిశీలించారు. గ్రామాలలో వర్షాల కారణంగా సమస్యలు ఉంటే ప్రజలు రెవెన్యూ అధికారులకు తెలిపాలని తహశీల్దార్ నరేందర్ మండల ప్రజలను కోరారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:తహసీల్దార్

**ఉప్పునుంతల,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మండలంలోని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ సునిత తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ప్రజలను కోరారు. మండల పరిధిలోని మొల్గర వద్ద దుందుభి నది ఉప్పొంగడంతో ప్రజలు నదిని దాటేందుకు ప్రయత్నించవద్దని ఆమె కోరారు. కూలిపోయే ఇళ్లల్లో నివసించవద్దని ఆమె కోరారు. రాబోయే రెండు రోజులపాటు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆమె కోరారు. పొంగి పొర్లుతున్న చెరువులును, వాగులను చూడడానికి వచ్చి సెల్ఫీల కోసం ప్రమాదాల బారిన పడవద్దని ఆమె కోరారు. అత్యవసరమైతే రెవెన్యూ పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

## ఈదమ్మ మాందాత కళ్యాణానికి మంగళసూత్రాలు..

**వెల్దండ, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** మండలంలోని బండోనిపల్లి గ్రామంలో ఈదమ్మ మాందాత కళ్యాణోత్సవానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కుల చిన్న జంగయ్యయాదవ్ పుస్తె మెట్టెలను సమకూర్చారు. జక్కుల చిన్న జంగయ్యయాదవ్ బృందం సభ్యులు నరేష్‌యాదవ్, కొండలుయాదవ్, జంగయ్య, మల్లేష్‌యాదవ్‌లు దేవాలయ కమిటీ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో కేశమల్ల రామచంద్రయ్య, గోపాల్, రమేష్, యాదయ్య, ప్రకాష్, ప్రమోద్, సంతోష్, దేవయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## వర్షంలో జ్వరంపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

**గద్వాల ,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** గద్వాల వైద్య సిబ్బంది వర్షాన్ని సైతం లెక్కచెయకుండా వార్డులు, గ్రామాల్లో వివిధ ఫీవర్ సర్వే నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సిద్ధప్ప సర్వే నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిద్ధప్ప ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం జిల్లాలో కురుస్తున్న వర్షాలు కారణంగా వివిధ వార్డులు గ్రామాలు, పట్టణాలలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ



సిబ్బంది, సూపర్వైజర్లు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పర్యటించి ఫీవర్ సర్వేతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటిని వేడి చేసుకుని చల్లారిన తర్వాత త్రాగాలని, ఎప్పటికప్పుడు వేడిగా చేసుకొని ఆహారాన్ని తీసుకోవాలని జ్వరాలు వచ్చినచో హెల్త్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, వార్డు, గ్రామాల ప్రజలకు తెలిపారు. ఎప్పటికి హెల్త్ సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు హెల్త్ సూపర్వైజర్లు వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి...

**మొదటి పేజీ తరువాయి భాగం..**

వర్షాల నేపథ్యంలో అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అధికారి హెడ్ క్వార్టర్ మెంటైన్ చేయాలని, రోడ్లపై వరదనీటిని ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులు, స్థానిక సంస్థల అధికారులు, సిబ్బంది పరీక్షించి సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా ఎప్పటికప్పుడు పునరద్దరణ చేసేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భారీ వరదలు వచ్చే నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా పునరావస కేంద్రాలను సిద్దం చేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని నీటి వనరులు, అందులోని నీటి నిల్వ పరిస్థితి, చెరువు కట్టలు మొదలగు వాటిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అదే విధంగా ప్రజలెవ్వరు కూడా నదీ పరివాహక ప్రాంతాలు, చెరువులు, కుంటలు పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలన్నారు. అతి భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అధికార యంత్రంగానికి సంపూర్ణంగా సహకరించాలని, మరో 48 గంటల పాటు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అత్యవసర పనులుంటే తప్ప ఎవ్వరు బయటకు రావొద్దని జిల్లాలోని ప్రజలందరికి కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని కలెక్టరేట్ కార్యాలయానికి పంపాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు వెంటనే స్పందించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ప్రజలు కరెంట్ స్తంభాలను ముట్టుకోకూడదని, కరెంట్ లైన్ల క్రింద, నిలబడటం, నడవడం, చెట్ల క్రింద ఉండటం లాంటివి చేయకూడదన్నారు. మత్స్యకారులు కృష్ణా నదీలో, చెరువులు, కుంటల్లో చేపల వేటకు వెళ్లకూడదని కలెక్టర్ సూచించారు.

## రానున్న రెండు రోజులు జాగ్రతగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

మోటార్ పరికరాలు ఉపయోగించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, దీని శాశ్వత పరిష్కారాన్ని త్వరలోనే అమలు చేస్తామని అన్నారు. ప్రజలు వర్షం ప్రభావం కారణంగా ఏ విధమైన ప్రమాదం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే అధికారుల సహకారం పొందాలని కలెక్టర్ సూచించారు. ప్రజల భద్రత కోసం జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, డిప్యూటీ తహశీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

## పీయూ పరిధిలో పరీక్షలు వాయిదా

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగే అన్ని థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా పరీక్షల్లో తేదీల్లో ఎలాంటి మార్పు ఉండదని సూచించారు. సోమవారం వాయిదా పడిన పరీక్షలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు. పరీక్షలో పూర్తి వివరాలు పీయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నట్లు వెల్లడించారు.

# పొంగిపోర్లుతున్న వాగులు, వంకలు...

**-పలు గ్రామాలకు రవాణా సౌకర్యం బంద్... -ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు**



అచ్చంపేటలో ఉధృతంగా పొంగుతున్న వాగులు



మున్ననూర్ చెక్ పోస్టు వద్ద ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం

**అచ్చంపేట,ఉప్పునుంతల, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో ఉన్న వా గులు, వంకలు నిండి పొంగి పోర్లుతున్నాయి. రహదారుల వెంట వాగులు, వంకలు పొంగి పోర్లి కోతకు గురై రహదారులపైకి వరద నీరు చేరుకోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో మర్లపాడుతండాలో ఉప్పొంగుతున్న వాగు వల్ల అక్కారం, ఘనపూర్, బక్కలింగాయపల్లి, ఆంజనేయ తాండ, దండ్యాల గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోవడంతో కనీస సౌకర్యాలను తీర్చుకోవడానికి ఆయా గ్రామాల ప్రజలు ఇ బ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలు గకుండా తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. వంగూరు మండల కేంద్రంలో రైతు వేధిక వద్ద వరద నీరు చేరుకొని రైతులు కార్యా లయానికి వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. మండలంలోని ఉల్పర, మిట్టసదగోడు గ్రామాల శివారుల్లో ఉన్న వాగులు వరద నీరుతో నిండటం వల్ల సమీప వ్యవసాయ పొలాల్లో సాగు చేసిన పంటలు నీట మునుగుతున్నాయి. ఉల్పర వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వంగూరు గ్రామంలో భారీ వర్షాలకు తడిచిన పాత ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్న పలు ఇండ్లు నేలమట్టమయ్యాయి.

**ఘాట్ రోడ్డులో విరిగిన కొండ చరియలు...**

**శ్రీశైలం పుణ్యక్షేత్రం వెళ్లే భక్తులకు ఆటంకం...**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అచ్చంపేట నియోజకవర్గం మన్ననూరు, అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీశైలం ఘాట్ రోడ్డులోని ఎత్తైన కొండ చరియలు విరిగి పడ్డాయి. శ్రీశైలం వెళ్లే ప్రయాణీకులు, భక్తులు తమ ప్రయాణాలను విరమించుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కొండ చరియలు విరిగి రహదారిపై పడటంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ప్రయాణీకులు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవడం మంచిది. భారీ వర్షాల నేపథ్యంలో కొండ చరియలు విరిగి పడుతున్న సమయంలో ప్రయాణాలు చేస్తే ఏదైన ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. కొండ చరియలు విరిగి పడుతున్న తరుణంలో ప్రయాణీకుల ప్రయాణాలను రద్దు పరుస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అచ్చంపేట సర్కిల్ పరిధిలోని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద అచ్చంపేట సీఐ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టి చెక్‌పోస్టును మూసివేసి శ్రీశైలం వెళ్లే ప్రయాణీకులను తిరిగి పంపిస్తున్నారు.

## మొల్గర వద్ద పరవళ్ళు తొక్కుతున్న దుందుభి

**అచ్చంపేట, కల్వకుర్తికి రాకపోకలు బంద్**

**వాగును దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరిక**

**మొల్గర వద్ద బారీకేడ్స్ ఏర్పాటు**

**అప్రమత్తమైన అధికార యంత్రాంగం**



మొల్గర వద్ద ప్రవహిస్తున్న దుందుభి

## కోయిల్‌సాగర్ 11 షెటర్లు ఎత్తివేత

**- పాజెక్టులోకి భారీగా వచ్చిచేరుతున్న నీరు**

**- ఉధృతంగా ప్రవహిస్తున్న కోయిలకొండ,అంకిళ్ల వాగులు**

**- నీటి నిల్వ స్థోమతకు మించి వచ్చి చేరుతున్న నీరు**

**- 32.6 ఫీట్లకు చేరిన నీటి మట్టం**

**- ఉరకలేస్తున్న బండర్‌నల్లి వాగు**



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు షెట్టర్లను తెరచిన దృశ్యం

**దేవరకద్ర,సెప్టెంబరు 01 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్ట కోయిల్‌సాగర్ ప్రాజెక్ట 11 షెటర్లను ఆదివారం ఎత్తిసి దిగువకు నీటిని వదిలారు. ప్రాజెక్టులో నీటి స్థోమత పెరుగడంతో షెట్టర్లను తెరచి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లకు ఉండగా, ప్రాజెక్ట ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతో ఏకంగా నీటి స్థోమత 32.6 ఫీట్లకుపెరిగింది. దీంతో వెంబడే ముందు జాగ్రత్తగా ప్రాజెక్ట షెటర్లను ఎత్తేశారు. ప్రాజెక్ట ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోని పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరడం ప్రారంభమైంది. ఒక్కసారిగా ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగింది.దీంతో వెంటనే సంబందిత అధికారులు ప్రాజెక్ట షెట్టర్లను ఒక్కొక్కటి 5 ఈంచుల చొప్పున తెరచి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టులోకి నీరు పెద్ద మొత్తంలో వచ్చి చేరుతుండటంతో కోయిల్‌సాగర్ వాగు పరిసర గ్రామాలకు చెందిన రైతులు అప్రమత్తంగా ఉండాలని అదికారులు సూచిస్తున్నారు. వాగువద్దకు వెళ్ళకూడదని హెచ్చరిస్తున్నారు. ప్రాజెక్ట వద్ద ఎస్ఐ నాగన్న అధ్వర్యంలో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరడంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్ట నిండుకుండను తలపిస్తుంది. ఎటు చూసిన ప్రాజెక్ట వద్ద కనుచూపుమేర నీరే కనిపిస్తుంది. ప్రాజెక్ట షెట్టర్లు తెరచిన విషయం తెలుసుకొన్న పర్యాటకులు వివిధ ప్రాంతాల నుండి కోయిల్‌సాగర్‌ను చూడటానికి రావడం ప్రారంభమైంది.

-ఉధృతంగా ప్రవహిస్తున్న కోయిలకొండ,అంకిళ్ల వాగులు..

కోయిల్‌సాగర్‌లోని వచ్చి చేరే కోయిలకొండ,అంకిళ్ల వాగులు ఆదివారం ఉధృతంగా పారడ ం ప్రారంభమయ్యాయి. ప్రాజెక్ట ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో వాటి ద్వారా నీరు అధిక మొత్తంలో కోయిల్‌సాగర్‌లోకి వచ్చి చేరుతుంది. దీంతో వెంబడే ప్రాజెక్టులో నీరు పెరిగింది.కోయిల్‌సాగర్ షెటర్లు తెరువడంతో ప్రాజెక్ట వాగుపై నిర్మించిన బండర్‌పల్లి వాగుతో పాటు 4 చెక్ డ్యాంలు ఒక్కసారిగా అలుగులు పారుతునే ఉన్నాయి. బండర్‌పల్లితో పాటు గూరకొండ,పెద్దరాజమూర్, చిన్నరాజమూర్, బస్వాపూర్‌ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌డ్యాంలు జలకలను సంతరించుకొన్నాయి. దీంతో కోయిల్‌సాగర్ వాగు పరిసర గ్రామలకు చెందిన రైతులు,ప్రజలు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.

## పెరిగిన వాగు ప్రవాహం

## వెళ్లలేని స్థితిలో వైద్యాధికారులు



వాగు దాటడానికి తాడు సహాయంతో ప్రయత్నిస్తున్న వైద్య, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

**లింగాల,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్యం చేయడానికి వెళ్లిన డాక్టర్లకు వాగు ప్రవాహం పెరిగి గ్రామానికి చేరుకోవడానికి వీలు పడలేదని అచ్చంపేట డిప్యూటి డిఎంహెచ్ఓ తారాసింగ్ తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని చెన్నంపల్లి, పద్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగు ప్రవాహం పెరిగిందని, పద్మనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో ఆమె భర్త కలెక్టర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఆదివారం లింగాల వైద్యాధికారి శివశంకర్ వైద్య సిబ్బందితో కలిసి పద్మనపల్లి గ్రామానికి చేరుకోవడానికి వెళ్లారు. అక్కడ చెన్నంపల్లి, పద్మనపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగు ప్రవాహం పెరిగి వాగు దాటలేని స్థితిలో ఉండడంతో అక్కడ నుంచే గ్రామానికి ఫోన్‌చేసి ఓ కిరాణా షాపులో మందులు ఏర్పాటు చేశామని, వాగు ప్రవాహం తగ్గిన తర్వాత గ్రామానికి వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని డిప్యూటి డిఎంహెచ్ఓ తారాసింగ్ తెలిపారు. వాగు దాటి వైద్యం చేయడానికి ప్రయత్నించినప్పటికి వాగు ప్రవాహం పెరిగి సాధ్యపడలేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివశంకర్, రెవెన్యూ అధికారిణి తబితారాణి, డిప్యూటి తహసిల్దార్ పట్టాభి, ఎంఆర్ఐ సీతారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుండా పోత వర్షంతో తూముకుంట బ్రిడ్జిపై పారుతున్న వాగు

**గోపల్దిన్నె రిజర్వాయర్ పొంగిపోర్లుతున్న అలుగు.. కల్వరాల సమీపంలో తెగిన బీమా కాల్వ 16వ ప్యాకేజీ..**



తూముకుంట బ్రిడ్జిపై పారుతున్న నీరు రాకపోకలకు ఇబ్బంది

**వీపనగండ్ల సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** కుండ పోతా వర్షంతో తూముకుంట బ్రిడ్జిపై పొంగిపోర్లుతున్న వాగు వలన రాకపోకలకు ప్రజలకు ఇబ్బందిగా మారి వాటిపై పోవడానికి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గోపాల్దిన్నె రిజర్వాయర్ అలుగులో భారీగా వస్తున్న వరద నీరుకు వాగుల సమీపంలో ఉన్న పంట పొలాలు నీటి మునిగినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవర్ధనగిరి నుండి వీపనగండ్లకు వచ్చే రోడ్డు బ్రిడ్జిలు ఉన్న దగ్గర నీళ్ల వాటిపై ఎక్కి పారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది దానితో అధికారులు అప్రమత్త ప్రజలకు చేస్తూ ఈ రోడ్డుపై ప్రయాణికులు వెహికల్స్ రావద్దని హెచ్చరికలు జారీ చేశారు అదేవిధంగా శ్రీరంగాపూర్ నుండి వీపనగండ్ల మీదుగా వచ్చే బీమా 16వ కాల్వ కల్వరాల్ల సమీపంలో తెగి హోరిగా గండి పడడంతో నీట మునిగిన వరిపొలాలు, వీపనగండ్ల సమీపంలోని బీమా కాలువ అమ్మాయి పల్లి రోడ్డు దగ్గర నీళ్లు ఎక్కి పారడంతో కోతకు గురై తెగిపోవడానికి సిద్ధంగా ఉన్నవి కాలువ నుండి వచ్చే టటువంటి పొలాల పాటు కాలువలు మొత్తం కూడా ఈ కాలువలో పడి రావడం వల్ల వర్షం పడడంతో ఎక్కువ నీళ్లు కాలువలు పట్టకుండా ఇరువైపులా ఎక్కి పారడంతో కోతకు గరై తెగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి మండలంలో వర్షపాతం 85 మిల్లీమీటర్లు నమోదు అయినట్లు తహసిల్దార్ వరలక్ష్మి తెలిపారు. ఈ రకంగా వాతావరణ పరిస్థితుల్లో కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల రైతులకు వేసినటువంటి పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పవచ్చు ప్రధానంగా ఎగువన కురుస్తున్నటువంటి వర్షాలకు కాలువలు వాగులు రిజర్వాయర్లు లో నీటిమట్టం పూరిస్థాయిలో నిండి పంట పొలాలపై పొంగి పోర్లడం వల్ల నార్లు వేసినటువంటి రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. తూముకుంట వాగు ఇరువైపులా దాదాపు 120 మీటర్లకు పైగా వెడల్పు ఉన్న ఈ వాగు భారీగా కురుస్తున్నటువంటి వర్షానికి వాగుకు ఇరువైపులా నీళ్లు పొంగి పోర్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని అందులో ఉన్న మోటర్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, అంతేగాక గత సంవత్సరం వేసిన తూముకుంట చాలా బాగా తండా కు రోడ్డు బ్రిడ్జిని నిర్మాణం చేయడం జరిగింది. ఈ బ్రిడ్జిపై నీళ్లు ఎక్కి పారడంతో అది తెగిపోవడానికి సిద్ధంగా ఉన్నది. అనే సంకేతం ఇస్తున్నది అంతేగాక బొల్లారం ఊరి సమీపంలో ఉన్న ఊరుకుంట పై నీళ్లు కట్టపై ఎక్కి పారడంతో ఈ చెరువు కింద నాట్లు వేసినటువంటి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలోనైనా అది తెగి పంట పొలాలపై నీళ్లు పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తుసన్నారు. దానితోపాటు వివిధ ప్రాంతాలలో నీళ్లు విపరీతంగా రహదారులపై పారుతుండడం వల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది ఈ పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తహశీల్దార్ వరలక్ష్మి ఎంపీడీఓ శ్రీనివాసరావు ఎస్సై నందికర్ నాయుడు హెచ్చరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## ఇళ్ల మధ్యలో నాలనీరు

## కాలనీ వాసుల ఇక్కట్లు

**ఇబ్బందుల్లో అంబేద్కర్‌నగర్ వాసులు**

**మక్తల్‌టౌన్,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మున్సిపాలిటీలోని 10వ వార్డు అంబేద్కర్ నగర్‌లోని ఇండ్లు మొత్తం జలమయం అవడం ఇండ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండడం, ఇళ్లలో ఉంటున్న ప్రజల కనీస నిత్యావసరాలు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. నాలాల నీరు వచ్చి చేరడంతో పందుల బెడదతో దోమలు పెరిగిపోయి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్,సిబ్బంది వెంట నే నివారణ చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌లోకి వరద నీరు

**నిలిచిన విద్యుత్ సరఫరా**

**సబ్ స్టేషన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్**

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్ద వడ్డెమాన్ శివారులోని సబ్ స్టేషన్‌లోకి వరదనీరు చేరుకోవడంతో మండలంలోని నెల్లికొండి, పెద్ద వడ్డెమాన్, చిన్న వడ్డెమాన్, పర్కాపూర్, దమగ్నాపూర్, సీతారాంపేట్ గ్రామా కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో గల మన్నెవాగుకు వరద నీరు పోటెత్తడంతో విద్యుత్ సబ్ స్టేషన్‌లోకి వరద నీరు ముంచెత్తడంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి వరద నీరు చేరుకున్న సబ్ స్టేషన్‌ను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నయంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు. ఆయన వెంట, ఎస్సై ఆర్.శేఖర్, నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్‌లోకి చేరుకున్న వరద నీరు

## గ్రామాలలో ప్రతి అధికారి అందుబాటులో ఉండాలి...



కృష్ణానది పుష్కర ఘాటు వద్ద వరద నీటిని పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

**ఇటిక్యాల సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** భారీ వర్షాల కారణంగా బీచుపల్లి కృష్ణా నదికి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు పర్యాటకులను నదిలోకి వెళ్ళనీయకుండా చూడాలని అలాగే భారీ కేడ్లను ఏర్పాటు చేయాలని భారీ వర్సాల కారణంగా గ్రామాలలో ప్రతి అధికారి బాధ్యతయుతంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం పుణ్యక్షేత్రం వద్ద కృష్ణానది వరద నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. మండల పరిధిలోని బీచ్‌పల్లి పుష్కర్ ఘాట్ వద్ద కృష్ణానది నీటి ఉధృతి, షేక్‌పల్లి వాగు పరిసర ప్రాంతాల్లో పరిస్థితిని వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా బీచ్ పల్లి పుష్కర్ ఘాట్ దగ్గర నీటి మట్టం పెరిగినందున, ప్రజలను నీటిలోకి రాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. పుష్కర్ ఘాట్ వద్ద మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం నిలిపివేయాలని కలెక్టర్ సూచించారు. పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇతర అన్ని అధికార విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. ఎక్కడ ఏం జరుగుతుందో వెంటనే తెలియజేయడానికి సంబంధిత అధికారులందరూ కలిసి ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఎర్రవల్లి సమీపంలోని వాగును సందర్శించారు. ఎర్రవల్లి నుండి ఐదు గ్రామాలకు షేక్ పల్లి, దువాస్ పల్లి, బీ వీరాపురం, సననూల్, కరుపాకుల గ్రామాలకు వెళ్లే వాహనాల రాకపోకలను నిషేదిస్తూ, ఇతర ప్రాంతాల మీదుగా దారి మళ్లించాలని, ఎర్రవల్లి స్టేజ్ దగ్గర సూచికల బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి అధికారులకు అవసరమైన నిర్మాణాలు అత్యంత వేగంగా చేపట్టాలని , ప్రత్యేకించి వాగులను మరమ్మత్తులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వాతావరణ పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ధరణిషా ఎం.పి.డి.ఓ మహమ్మద్ అజార్ మోహియుద్దీన్, అలంపూర్ సి.ఐ రవి బాబు, ఆర్ అండ్ బి ,డి.ఈ.ఈ కిరణ్, ఎస్సై వెంకటేష్, ఆర్.ఐ షంషిర్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

### అధికారులు తక్షణ చర్యలకు సిద్దంగా ఉండాలి:ఎమ్మెల్యే

**కల్వకుర్తి, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:**గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ఉండే విధంగా ప్రభుత్వాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజలను రక్షించే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశించారు. అధికారులు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, క్రింది స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకొని ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాగులు కోతకు గురై రైతులు పండించిన పంటలు నీట మునిగాయని, వాటిని అధికారులు గుర్తించి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని, ఆయా గ్రామాల్లో రహదారులపైకి వరద నీరు చేరుకొని రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పోలీస్, రెవెన్యూ యంత్రాంగంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:మక్తల్ ఎమ్మెల్యే

**మక్తల్ టౌన్,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీరు వచ్చి చేరడం వల్ల కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిసి, వారి సమస్యలను పరిష్కరించడానికి హుటాహుటిన కాలనీకి చేరుకుని స్థానిక కమిషనర్, స్థానిక నాయకులకు వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వాగులు దాటే ప్రయత్నం ఎవరూ చేయకూడదని, మట్టి ఇండ్లు కాలిపోయే ప్రమాదం ఉందని వాటిలో ఎవరూ నివాసం ఉండొద్దని సూచించారు. బైక్‌లపై వెళ్లేవారు, దూర ప్రయాణాలు చేసే వారు వారి ప్రయాణాలను మానుకోవాలన్నారు. ప్రమాదాలు జరగకుండా చూసుకోవడంలో యువత అధికారులకు తోడుగా నడిచి,సమస్య పరిష్కారంలో ముఖ్యపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా ముందుకు రావాలని కోరారు. జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ సిబ్బందిని , రెవెన్యూ సిబ్బంది అధికారులను ముందుగానే అప్రమత్తం చేశామని, పలుచోట్ల రెడ్‌అలర్ట్ ప్రకటించి అటువైపు ఎవరినీ వెళ్లనీయకుండా అప్రమత్తం కావాలని కోరారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఏమైనా అవసరం అయితే తప్పిస్తే బయటకు రావద్దని సూచించారు. ఏదైనా అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే పోలీసులకు 9440297597, 9666859992లకు తెలియజేయాలన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పేట నియోజకవర్గం ఎమ్మెల్యే పర్ణికరెడ్డి

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** రానున్న మరో 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిన సందర్భంగా ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఇళ్లల్లో నుంచి ఎవరు బయటకు రాకూడదని కోరుకుంటున్నాను. పేట నియోజకవర్గం ఎమ్మెల్యే పర్ణికరెడ్డి అన్నారు. కొన్ని గ్రామాలలో వాగులు, చెరువులు పొంగి పొరలి ఊర్లలోకి చేరుతున్నాయని అధికారులతో మాట్లాడడం జరిగింది. దానికి సంబంధించి ఏం చేయాలనే పరిష్కారం గురించి చర్చిస్తున్నాం. మేమందరం మీకు అందుబాటులో ఉంటామని కావున ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లేకపోతే పిఎ దృష్టికి తీసుకురావాలని కోరారు. నాతోపాటు మా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రతి గ్రామంలో ఏ అవసరమున్నా అందుబాటులో ఉంటారని ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకొస్తారని తెలియజేస్తున్నాను. ప్రజలు అప్రమత్తంగా ఉండండి సురక్షితంగా ఉండండని ఎమ్మెల్యే కోరారు.

## కోయిల్‌సాగర్‌లో గంగమ్మకు ఎమ్మెల్యే పూజలు

**దేవరకద్ర,సెప్టెంబరు 01 ప్రభాతావార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మదుసూధన్‌రెడ్డి గంగమ్మకు పూజలు చేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు రెండవ షెట్టర్‌కు పూజలు చేసి దిగువకు నీటిని వదిలారు.నీళ్ళలోకి పూలు చల్లారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి సేవలను సైతం అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి,కౌకుంట్ల మండలం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి,ఫారూఖ్,రాంపండు, నరసింహ్మారెడ్డిలతో పాటు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాగు దాటుతున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

### 5 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:**వాగు దాటుతున్న వ్యక్తిని పోలీసులు ధైర్య సాహసాలతో కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... నాగనూలు వాగు ఉద్రిక్తతతో ప్రవహించడంతో నాగర్‌కర్నూల్ పట్టణం నుంచి నాగనూలు గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. మండల పరిధిలోని నాగనూలు, మల్కాపురం, పులిజాల, తాళ్లపల్లి, నడిగడ్డ గ్రామాలకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉండ టంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం నాగనూలు వాగు దాటుతుండగా నీటి ప్రవాహనికి కొట్టుకొనిపోతున్న ఒక వ్యక్తిని హెడ్ కానిస్టేబుల్ తక్కి, కానిస్టేబుల్ రాము తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి ఆ వ్యక్తిని కాపాడారు. ప్రమాద హెచ్చరికల దృష్ట్యా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## ప్రభుత్వం పాత పెన్షన్ విధానమే అమలుపరచాలి

**బిజినపల్లి,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటి (జెఎసి) పక్షాన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు కలిసి ఆదివారం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సిపిఎస్) విధానాన్ని (ఓపిఎస్) విధానాన్ని రద్దు పరచాలని, ఓల్డ్ పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని పాల్గొన్న ప్రతి ఉద్యోగ సంఘం ప్రతినిధులు ముక్తకంఠంతో నినదించారు. వివిధరూపాలలో పెన్షన్ విధానాన్ని తీసుకురావడం సరైంది కాదని, ప్రతి ఉద్యోగి, ప్రతి ఉపాధ్యాయునికి పాత పెన్షన్ స్కీం సరైనదని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తేవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా సిపిఎస్ స్థానంలో ఓపిఎస్ పునరుద్ధరించాలని ప్రభుతాన్ని కోరుతూ అన్నిస్థాయిల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీరాములు, ఎంపిడిఓ కతలప్ప, ఎంపిఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ సిబ్బంది నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

## వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వాగును పరిశీలించిన ఎంపిడిఓ ఆంజనేయులు

**లింగాల,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఓ ఆంజనేయులు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని చెన్నంపల్లి, పద్మనపల్లి గ్రామాల మధ్య వర్షాలకు ప్రవహిస్తున్న వాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలు వాగును దాటడానికి ప్రయత్నించకూడదని అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈదురుగాలులు, ఉరుము, మెరుపులతో కూడిన వర్షాలు వస్తున్నాయని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే రైతులు పాడి పశువులను సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచాలని సూచించారు. రైతులు పొలాల్లో మోటార్ దగ్గర, కరెంట్ పోల్స్ దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వర్షాలకు అవసరం అయితే తప్ప ఎవరు కూడా బయటకు రాకూడదని సూచించారు.

## బారీ వర్షాల కారణంగా

## పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వార్డుల్లో పర్యటించి పలువురిని

### పునరావస కేంద్రాలకు తరలించిన అధికారులు

**అయిజ సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం మండల తహశీల్దార్ జ్యోతి స్థానిక ఎస్సై విజయభాస్కర్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి లు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి తో కలిసి పట్టణంలో పర్యటించారు. ఇందులో భాగంగా ప్రమాదకర స్థితిలో ఉన్న ఇండ్లను గుర్తించి ఆ ఇండ్లలో ఉన్న వారిని పునరావస కేంద్రమైన బాలికల ఉన్నత పాఠశాలకు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అత్యవసరం అనుకుంటే బయటికి రావాలని సూచించారు. శిథిలా వ్యవస్థలో ఉన్న ఇండ్లలో ఎట్టి పరిస్థితుల్లో నివాసము ఉండకూడదని అట్టివారు తమకు సమాచారం అందించాలని పట్టణ ప్రజలకు సూచించారు. తాత్కాలిక నివాసం కొరకై తమ బంధువుల ఇండ్లకు గాని లేదంటే పునరావస కేంద్రంకి వెళ్లాలని సూచించారు. అలాగే కరెంటు స్తంభాలను తాకకుండా పెద్దలు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు అయినా డెంగీ మలేరియా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలిపారు.

# నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి పెద్దపీట..



సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న పార్లమెంటు సభ్యులు మల్లు రవి

వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : వనపర్తి నియోజకవర్గం పరిధిలోని విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో పటిష్టపరుస్తున్నామని ఇందుకు సంబంధించి రూ. 600 కోట్ల రూపాయలతో ప్రతి మండల కేంద్రంలో ఎడ్యుకేషనల్ హబ్బుల నిర్మాణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఆదివారం పెబ్బేరు మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని, శ్రీరంగాపురం మండల కేంద్రంలో కస్తూర్బా విద్యాలయాన్ని, వనపర్తి జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న సోషల్ వెల్ఫేర్ బాలికల ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలను వారు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, డీఈఓ గోవిందరాజులతో కలిసి సందర్శించి అధ్యాపకులతో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు పలు రకాల చర్యలను చేపట్టిందన్నారు. మూడవ తరగతి వరకు స్థానికంగా ఉండే అంగన్వాడీ కేంద్రాలలో విద్యను అభ్యసించిన అనంతరం నాలుగవ తరగతి నుండి డిగ్రీ వరకు ఎడ్యుకేషనల్ హబ్బులోనే విద్యను అభ్యసించేందుకు పూర్తి స్థాయిలో మార్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు

### 600 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో

### ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణాలకు శ్రీకారం

### నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ

### పాఠశాలలను కళాశాలలను పరిశీలించిన ఎంపీ

### మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

విద్యావ్యవస్తను పటిష్టపరిచేందుకు క్రమశిక్షణతో పని చేయాలని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఎంపీ మల్లు రవీ, ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి డిఈఓ గోవిందరాజులు తో పాటు పలువురు అధికారులు మధ్యన భోజనం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జయసుధ, మధు గౌడ్ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ ,వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య ,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్ వెంకటేష్, సుమిత్ర ,యాదగిరి ఆయా కళాశాలల అధ్యాపకులు ,ఉపాధ్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలోకి చేరిన వరద నీరు రోగుల అవస్థలు



ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోకి చేరిన వర్షపు నీరు

**ఆత్మకూర్ సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆదివారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోకి వరద నీరు చేరడంతో రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. గత రెండు రోజులుగా కురుస్తున్న ఆకాల వర్షాలకు పట్టణంలోని ప్రధాన వీధులన్నీ జలమయం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ తదితరులు విజ్ఞప్తి చేస్తూ పట్టణంలోని పురవీధుల గుండా కలే తిరుగుతూ కూలడానికి సిద్ధంగా ఉండడం ఇండ్ల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. భారీ వర్షాల మూలంగా ప్రభుత్వాసుపత్రిలోకి వరద నీరు చేరడంతో యుద్ధ ప్రాతిపదికన చైర్పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ దగ్గరుండి వర్షపు నీటిని బయటికి తరలించేందుకు ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో భారీ వర్షాలకు ఎక్కడికక్కడ బురదమయంగా కావడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మండలంలోని మూలమల్ల గ్రామం నుండి ఆత్మకూరు చేరుకునే ప్రాంతంలో గల చెరువు అలుగా పారడంతో మూలమలకు ఆత్మకూరుకు రాకపోకలను బంద్ చేశారు. ఆత్మకూరు సిఐ శివకుమార్ యాదవ్ ఎస్సై నరేష్ లు మండలంలోని వివిధ గ్రామాలలో తిరుగతూ నది పరివాహాక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఎప్పటికప్పుడూ ప్రజలను జాగ్రత్త పరుస్తున్నారు. శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో దాదాపు పది గంటల పాటు విద్యుత్ సిబ్బంది స్పందించి ఎక్కడికక్కడ యుద్ధ ప్రాతిపదికనుల పనులు పూర్తి చేయడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏది ఏమైనప్పటికి గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు బయటికి రావాలంటేనే భయబ్రాంతులకు గురవుతున్నారు.

# అలుగు పారుతున్న చెరువులు.. పొంగి పొర్లిన వంకలు

### తెగిన కెఎల్ఐయూటీ నీట మునిగిన పంటలు.. భద్రత చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం



బిజినపల్లి శివారులో నీట మునిగిన పంట పొలాలు

**బిజినేపల్లి,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొంగి పొర్లిన వాగులు, వంకలతో ప్రధాన రహదారులు జలమయంగా మారాయి. గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో ప్రధాన రహదారులు దెబ్బతిని గుంటలుగా మారాయి. ఆదివారం తెల్లవారుజాము నుండి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. దీంతో మండల వాసులు ఇండ్లకే పరిమితమయ్యారు. అవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రాకూడదని ఎస్సై నాగశేఖర్‌రెడ్డి సూచించారు. వరద నీటిలో ద్విచక్ర వాహనాలతో వెళ్లేందుకు సాహసం చేయవద్దని, రోడ్డుపై నిలిచిన నీటిలో పిల్లలను, వృద్ధులను ఒంటరిగా బయటికి పంపవద్దని ఎస్సై కోరారు. పురాతన, శిథిలావస్థ భవనాల్లో ఎవరైనా ఉంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహసిల్దార్ శ్రీరాములు గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలో 10 సెంటీమీటర్ల వర్షం కురవగా ఆదివారం మధ్యాహ్నంకే దాదాపు నాలుగు సెంటీమీటర్ల వర్షం కురిసిట్లు అధికారులు తెలిపారు. మండలంలోని పాలెం పెంటోని చెరువు, ఖానాపూర్ పెద్ద చెరువు అలుగులు పారాయి. లట్టుపల్లి శివారులోని ఘన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ యూటీ నాగోలు మన్నెపురెడ్డి పొలం వద్ద తెగిపోవడంతో నీరంతా నక్కల చెరువు దివ్య ప్రాంతంలోని పంట పొలాలను నీట ముంచింది. దాదాపు 80 ఎకరాల దాకా వరి మొక్కజొన్న పత్తి పంటలు నీటిమయమయ్యాయి. నక్కల చెరువు వరద నీటితో తెగిపోయే ప్రమాదం ఉండడంతో తూమును గ్రామస్తులు తొలగించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో 12 ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. మండలంలో అధికారులు తీసుకుంటున్న చర్యలపై డిపిఓ రామ్మోహన్ అధికారులతో చర్చించారు. కురిసిన వర్షాలకు అక్కడక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. త్రాగునీటి సరఫరాలో ఆటంకం ఏర్పడడంతో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి అధికార యంత్రాంగం ఎక్కడ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



లట్టుపల్లి వద్ద తెగిపోయిన ఘనపూర్ బ్రాంచ్ కెనాల్

# ఊకచెట్టు వాగుకు పోటెత్తిన ప్రవాహం



నీట మునిగిన వరిపంట

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులలో నీటి ఉధృతి పెరిగి అలుగులు పారుతున్నాయి. ఆదివారం కోయిల్‌సాగర్ 11 గేట్లు ఎత్తడంతో ఊకచెట్టు వాగుకు నీటి ప్రవాహంతో పోటెత్తింది. బండర్‌పల్లి వంతెనను ఆనుకుని నీటి ప్రభావం ఉధృతంగా ప్రవహించింది. వాగుకు ఇరువైపులా నీటి ఉధృతి కనిపించింది. అల్లిపూర్ బ్రిడ్జిపై మూడు ఫీట్ల ఎత్తులో నీటి ప్రవాహం ఉండడంతో పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. అక్కడ పోలీసులను బందోబస్తుగా ఉంచినట్లు ఎస్సై ఆర్.శేఖర్ తెలిపారు. ఊకచెట్టు వాగులో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించింది. వాగుకు ఇరువైపులా నీటి ఉధృతి కనిపించింది. ఊకచెట్టు వాగులో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మండల ప్రజలు వాగు సమీపంలోకి వెళ్లరాదని సూచిస్తున్నారు. మండల కేంద్ర సమీపంలోని గొలుసుకట్టు కాలువపై నుంచి వరదనీరు పొంగడంతో సమీపంలోని సుమారు 50 ఎకరాలలో వరిపంట మునిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్సాలకు మట్టిఇల్లు కూలుతున్నాయి. చిన్నచింతకుంటలో ఒకటి, మద్దూరులో ఒకటి, నెల్లికొండిలో ఒకటి మట్టి ఇళ్లు కూలిపోయాయని తహసిల్దార్ కృష్ణయ్య తెలిపారు. వడ్డెమాన్ సమీపంలోని మన్నెవాగు నీటి ఉధృతి తగ్గకపోవడంతో రెండవరోజు రాకపోకలను నిలిపివేశారు. ఈ అకాల వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు తెలిపారు.

# ఆగని వర్షం జనజీవనం అస్తవ్యస్తం



అలుగు పారుతున్న కర్ని చెరువు

**మక్తల్,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలో గత 48 గంటలుగా వర్షం ఏ మాత్రం ఆగడం లేదు. క్రమం తప్పకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. మక్తల్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన ఎల్లమ్మకుంట, శ్రీరామ్‌నగర్, అంబేద్కర్‌నగర్ ఏరియాల్లో ఇండ్లలోకి వర్షపునీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం ఉదయం పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. మండలంలోని కర్ని పెద్దచెరువు అలుగు పారుతుండడంతో చిట్యాల, పంచలింగాల, పంచదేవ్‌ప హాడ్, పసుపుల, పారేవుల, ముస్లాయిపల్లి, అనుగొండ, చిన్న గోప్లాపూర్, భగవాన్‌పల్లి తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం పూర్తిగా నిలిచిపోయి జనం ఇబ్బందులు పడ్డారు. మక్తల్ నుంచి గద్వాలకు వెళ్లే ప్రధాన రహదారిపై రుద్రసముద్రం వద్ద రెండు మీటర్ల మేర రహదా రిపై వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపో యాయి. మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో అక్కడ పరిస్థితిని పరిశీలించారు. అలాగే గొల్లపల్లి మంతన్‌గోడ్ మధ్యలో వరదనీరు ఎక్కువగా ప్రవహిస్తున్నందున రాకపోకలు నిలిచిపోయాయి. మండ లంలోని సంగంబండ వద్ద సంగంబండ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో నేరడుగం బ్రిడ్జిపై రాకపోకలు స్తంభించిపోయాయి. పట్టణానికి చేరుకునే ప్రధాన రహదారులన్ని జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో పట్టణానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయాల్లో మాత్రమే ఇండ్లలో నుంచి బయటికి వెళ్లాని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సిఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి ప్రజలను కోరారు.

## కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ

### -బండర్‌పల్లి వాగు పరిశీలన




కోయిల్‌సాగర్ వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

**దేవరకద్ర,సెప్టెంబరు 01 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని భారీ నీటి పారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌ను ఆదివారం సాయంత్రం జిల్లా ఎస్పీ జానకి సందర్శించారు.కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆమె ప్రాజెక్టును పరిశీలించడానికి కోయిల్‌సాగర్‌కు వచ్చారు.ఈ సందర్భంగా సంబందిత అధికారులు, ఎస్ఐ నాగన్నను ఆమె అన్ని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అలాగే బండర్‌పల్లి వాగును కూడ ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

## నేటి ప్రజావాణి రద్దు

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం యావత్తు క్షేత్రస్థాయిలో ఉండి వర్షం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలు తీసుకుంటున్నందున ఈ నెల 2న (సోమవారం)న జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల జిల్లా ప్రజలు ఈ సోమవారం ఫిర్యాదులను సమర్పించేందుకు నారాయణపేట జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

## కల్వర్టు నిర్మించండి

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** నారాయణపేట సమీపంలో నక్క రామయ్య కాలనీ దగ్గర వాగు పారుతుందని అక్కడ కల్వర్టు నిర్మించాలని మూడో వార్డు మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదని ప్రస్తుతం మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వాగు పొంగిపొర్లుతుందన్నారు. రాకపోకలకు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతినిత్యం పాలు, పెరుగు అమ్మేందుకు కాలనీ వాసులు నారాయణపేటకు వస్తున్నారని వారికి రెండు రోజుల నుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కారం చేయాలన్నారు.

## పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి

### డిపిఓ రామ్మోహన్

**బిజినేపల్లి,సెప్టెంబరు 01 ప్రభాతవార్త :** మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై డిపిఓ రామ్మోహన్ బిజినపల్లి అధికార యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఆదివారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరద ముప్పు పరిస్థితులపై చర్చించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి అధికారులు సెలవులు పెట్టవద్దని త్రాగునీటి సరఫరా మౌలిక సదుపాయాల కల్పనలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కూలిపోయే స్థితిలో ఉన్న మట్టి ఇళ్లలో నుంచి ప్రజలను పునరావాస కేంద్రాల్లో ఉంచాలన్నారు. అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు సచివాలయంలో అందుబాటులో ఉండాలని, విద్యుత్, తాగునీటికి రాకపోకలకు అంతరాయాలు కలగకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడా కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ వారిగా ఓటర్ల జాబితా గ్రామ పంచాయతీ వారిగా తయారు చేయాలని పంచాయతీ అధాకరులను ఆదేశించారు. సమావేశంలో తహసిల్దార్ శ్రీరాములు, ఎంపిడిఓ కతలప్ప, ఎంపిఓ నరసింహులు, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## మన్యంకొండలో ఘనంగా ఉట్ల మహోత్సవం

### - ఘనంగా స్వామివారి శేషవాహనసేవ

### - అలంకరరణలో దర్శనమిచ్చిన స్వామివారు

**దేవరకద్ర,సెప్టెంబరు 01 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఉట్ల మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా శ్రావణమాసం చివరి శనివారం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పర్వదిన వేడుకలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శేషవాహనంపై స్వామి వారిని ఊరేగింపుగా తీసుకవచ్చారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. అనంతరం ఉట్ల మహోత్సవాన్ని నిర్వహించారు. ఉట్లను కొట్టడానికి భక్తులు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుండి భక్తులు మన్యంకొండకు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళీ గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

